పార్కింగ్ స్థలాలుగా రోడ్ల మార్జిన్లు

- రోజుల తరబడి రోడ్లపై వాహనాల పార్కింగ్
- రోడ్లపైనే వ్యాపారాలతో ప్రజల ఇబ్బందులు
- అధికారుల నిర్లక్ష్యంతో సమస్య జటిలం

ఇబ్రహీంపట్నం: వాహనదారులు, ప్రజలు రాకపోకలు కొనసాగించేందుకు ఏర్పాటు చేసిన రోడ్లు, సర్వీస్ రహదారులు పార్కింగ్ స్థలాలుగా మారుతున్నాయి. రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇబ్రహీంపట్నంలో పవిత్ర సంగమం, ఫెర్రీ, సినిమా థియేటర్లు, ఎన్టీటీపీఎస్ వైపు వెళ్లే రోడ్లలో రోజుల తరబడి వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. పలు గ్రామాల నుంచి ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం ఇక్కడికి వస్తుంటారు. దీంతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటోంది. ఇలాంటి ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా భారీ, ఇతర వాహనాలు అడ్డదిడ్డంగా నిలుపుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. విశాలమైన రోడ్లు కనిపిస్తే చాలు వాహనాలు నిలిపివేసి వెళ్లిపోతున్నారు. రోడ్లు ఆక్రమించి హోటళ్లు, చిరు వ్యాపారాలు ఏర్పాటు చేయడంతో వినియోగదారులు రోడ్లపైనే వాహనాలు నిలిపి వేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

సర్వీస్ రోడ్లపైనే వాహనాల నిలుపుదల

ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రధాన రోడ్లు, సర్వీస్ రోడ్లలో వ్యాపార, వాణిజ్య సంస్థలు సినిమా థియేటర్లు, హోటళ్లు అనేకం ఉన్నాయి. చిరు వ్యాపారులు సైతం సర్వీస్ రోడ్లలోనే వ్యాపారాలు చేయడంతో రోడ్లు ఇరుకుగా మారాయి. వివిధ పనులపై ఇక్కడకు వచ్చే వినియోగదారుల వాహనాలు సర్వీస్ రోడ్డు పైనే నిలుపుతున్నారు. సాయంత్రం వేళల్లో సినిమాలకు వచ్చేవారు, హోటల్స్‌కు వెళ్లేవారితో రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఇటువంటి రోడ్డులో వాహనాలను పార్కింగ్ చేయడం వలన రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, ప్రజలకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సర్వీస్ రోడ్లపై పార్కింగ్ చేయకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్ రోడ్డులో పార్కింగ్ చేసిన బస్సులు, లారీలు

రోడ్లపై కూడా అదే పరిస్థితి

ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ నుంచి ఎన్టీటీపీఎస్ రోడ్డులో పోలీస్ స్టేషన్, పలు వాణిజ్య బ్యాంకులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. నిత్యం ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులతో రోడ్డు రద్దీగా ఉంటోంది. ఈరోడ్డులో ఓ వైపు లారీలు, స్కూల్ బస్సులు, ఆటోలు నిలపడం వలన ఇతర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి లారీలు బస్సులు పార్కింగ్ చేయడం వలన కొన్ని సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రింగ్ సెంటర్ నుంచి ఫెర్రీ వెళ్లే వైపు రోడ్డుకు మధ్యలో చిరు వ్యాపారాలు, ఆటోలు, ఇతర వాహనాలు నిలిపి వేస్తున్నారు. రింగ్ సెంటర్ నుంచి పవిత్ర సంగమం వెళ్లే మరో రోడ్డులో సైతం వాహనాలు నిత్యం నిలిపివేస్తున్నారు. ఇదే రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన హోటల్ వద్ద వాహనాల పార్కింగ్‌తో డబుల్ రోడ్డుగా ఉన్న సంగమం రోడ్డు సింగిల్ రోడ్డుగా మారింది.

వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు



స్థానిక సర్వీస్ రహదార్లపై ఎంతోమంది వినియోగదారులు రాకపోకలు సాగిస్తున్నారు. వాహనాలు నిలపడం వల్ల రాకపోకలకు అసౌకర్యంగా ఉంటుంది. ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోతుంది. వాహనచోదకుల మధ్య వాగ్వాదం జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– బి.రాజేష్, ఇబ్రహీంపట్నం

కొండపల్లిలో సమస్య తీవ్రం

కొండపల్లిలో రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డు బ్రిటిష్ కాలంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పెరిగిన జనాభాకు అనుగుణంగా రోడ్డు విస్తరణ జరగలేదు. ఇరుకుగా ఉండే రోడ్డులో బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇదే రోడ్డులో వాహనాలు పార్కింగ్, చిరు వ్యాపారుల వలన వాహనదారులు పడే ఇబ్బందులు అంతాఇంతా కాదు. బ్యాంక్ సెంటర్‌లో సమస్య మరింత జటిలంగా మారింది. రాజుల కాలం నుంచి ఉన్న మార్కెట్ సెంటర్‌లో రెండు ఆటోలు ఎదురెదురుగా వెళ్లాలంటే వెనుకవైపు ఉన్న వాహనదారులు నరకం చూడాల్సిందే. సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల విస్తరణతో పాటు రోడ్లపై వాహనాల పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం రోడ్డులో ఏర్పాటు చేసిన హోటల్ వద్ద రోడ్డు కనిపించకుండా పార్కింగ్ చేసిన వాహనాలు



ఇబ్రహీంపట్నంలో థియేటర్లు ఉన్న సర్వీస్ రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలు

అధికారులు ఎక్కడ?



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న ఈదులగూడెం సచివాలయం

ఆగిరిపల్లి: ప్రజలకు అందుబాటులో ఉండాలని, అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని నిత్యం జిల్లా ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. మండలంలోని ఈదులగూడెం సచివాలయంలో సోమవారం ఉదయం 11.30 గంటలైనా ఒక్క అధికారి కనిపించలేదు. వారికి కేటాయించిన కుర్చీలు ఖాళీగా దర్శనమివ్వడంతో పనుల నిమిత్తం వచ్చిన గ్రామస్తులు వెనుదిరిగిపోయారు. ఉద్యోగులు గత కొన్ని రోజులుగా ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించే రోజు 9 గంటల కల్లా విధుల్లో ఉండాలి. ఏ ఒక్కరూ 11:30 గంటల వరకు రాలేదు. ప్రజా సమస్యలు విన్నవించేందుకు ఏర్పాటు చేసిన రోజే సిబ్బంది అందుబాటులో లేరంటే మిగిలిన రోజుల్లో పరిస్థితి అర్థం చేసుకోవచ్చని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ బి.భార్గవిని వివరణ కోరగా ఇద్దరు మాత్రం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జీఎస్టీ 2.0 సమావేశంలో పాల్గొన్నారని, ఒకరు వట్టిగుడుపాడు సచివాలయానికి వెళ్లారని, మిగిలిన సిబ్బంది ఎందుకు ఆలస్యంగా వచ్చారో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

నూతన భవనం ప్రారంభం

విస్సన్నపేట: స్థానిక షిర్డీ సాయిబాబా గుడి పక్కన నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి జ్యోతిపీఠాన్ని సోమవారం వేద పండితుల సమక్షంలో ప్రారంభించారు. జ్యోతిపీఠం గురుస్వాములు, దీక్షాపరులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

క్లుప్తంగా

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



మైలవరం: చిలుకూరివారిగూడెంలోని అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 2007–2008 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.25 వేల విలువ చేసే యూనిఫాంను సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని అన్నే కుసుమ కుమారి పూర్వ విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు ప్రత్తిపాటి శ్రీనివాసరావు, పల్లపు శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహం అందజేత



తిరువూరు: ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గంపలగూడెం మండలం నెమలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని కాశిమళ్ల నందినికి వైఎస్సార్ సీపీ గంపలగూడెం మండల అధ్యక్షుడు కావూరి వినయ్‌కుమార్ రూ.50 వేల నగదును సోమవారం అందజేసి అభినందించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నందినిని శాలువాతో సత్కరించి నగదును వినయ్‌కుమార్ అందజేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి నిధికి మరో రూ.5 వేలను ప్రధానోపాధ్యాయుడికి ఆయన అందజేశారు.

విజేతలకు అభినందన



తిరువూరు: స్థానిక రేవంత్ డిఫెన్స్ స్కూల్‌లో కరాటే శిక్షణ పొందుతూ పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారని కోచ్ మరకాల రేవంత్ తెలిపారు. చెన్నైలో ఆదివారం కొంగల జెస్సీ, జెట్టి జ్యోత్స్న, గోదా నిఖిల్, గరిడేపల్లి ధన్యశ్రీ, గోదా రోహన్ పునీత్‌లను అసోసియేషన్ సభ్యులు అభినందించారని తెలిపారు.

కోట మహిషమ్మ ఆదాయం రూ.7.02 లక్షలు



నూజివీడు: పట్టణంలోని శ్రీ కోట మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయానికి దసరా మహోత్సవాల్లో రూ.7,02,620 ఆదాయం లభించింది. దసరా ఉత్సవాల ముగింపు అనంతరం సోమవారం ఆలయంలో ఈఓ అలివేణి ఆధ్వర్యంలో గన్నవరం ఇన్‌స్పెక్టర్ అనురాధ పర్యవేక్షణలో ఆలయ ఆవరణలో హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. హుండీ కానుకల ఆదాయం 3,30,656 రాగా, రూ.300 టిక్కెట్ల ద్వారా రూ.1,14,300, రూ.25 టిక్కెట్ల ద్వారా రూ.52,100, డొనేషన్ల ద్వారా రూ.2,05,564 కలిపి మొత్తం రూ.7,02,620 ఆదాయం సమకూరింది.

ముత్యాలమ్మ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం

వీరులపాడు: ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ ఉండాలని వైఎస్సార్ సీపీ నియోజవర్గ సమన్వయకర్త డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు అన్నారు. వీరులపాడు గ్రామంలో ముత్యాలమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు జగన్‌మోహనరావుకు మందుగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జగన్‌మోహనరావు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నూతన వస్త్రాలు అందజేశారు. శైవ క్షేత్ర పీఠాధిపతులు శివస్వామి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొని విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

190 మందికి వైద్య పరీక్షలు

నందిగామరూరల్: మండలంలోని తొర్రగుడుపాడు గ్రామంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి కంటి ఆసుపత్రి వైద్యులు రోసిపద్మ, అచంట లక్ష్మీపతి, కౌశిక్‌లు రోగులను పరీక్షించారు. మొత్తం 190 మంది రోగులు వైద్య పరీక్షలకు రాగా అందులో 45 మందికి కంటి శుక్లాల అపరేషన్ చేసుకునేందుకు గుర్తించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్నె కళావతి, సర్పంచ్ చెరుకూరి హైమారావు, ఫౌండేషన్ ప్రతినిధి కట్టా నరసింహారావు, సాంబశివరావు, వినయ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చర్యలు

నూజివీడు: పట్టణంలోని బాపూనగర్ రోడ్డు అంకమ్మ గుడి ఏరియాలోని ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అన్నారు. అంకమ్మ గుడి ఏరియాలో నీరు నిలిచి ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంతవాసులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గతంలో అర్జీ అందజేయగా సోమవారం సాయంత్రం అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఇక్కడ శాశ్వత డ్రెయినేజీ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు రూ.3 కోట్లతో అంచనాలు రూపొందించి మంత్రికి అందజేశారని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తారన్నారు. అప్పటి కచ్చా డ్రెయినేజీ నిర్మించి వర్షం నీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్, టీపీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ గుగులోతు బద్రూ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

లారీ ఓనర్ల గేటు ముట్టడి కార్యక్రమం భగ్నం

ఇబ్రహీంపట్నం: లారీ ఓనర్ల ఎన్టీటీపీఎస్ గేటు ముట్టడి కార్యక్రమాన్ని సోమవారం పోలీసులు భగ్నం చేశారు. లారీ ఓనర్లు ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ నుంచి ఎన్టీటీపీఎస్ పాత గేటు వరకు ర్యాలీ నిర్వహించారు. భారీగా చేరుకున్న పోలీసులు వారిని గేటు వద్దకు చేరకుండా అడ్డుకున్నారు. ఎన్టీటీపీఎస్ బూడిద చెరువులో ఉచితంగా లోడింగ్ చేయాలని, ఏపీ జెన్‌కో ఇచ్చిన బూడిద లోడింగ్ టెండర్ రద్దు చేయాలని లారీ యజమానులు డిమాండ్ చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న లారీ ఓనర్ల సంఘం నాయకులు

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మైలవరం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గ్యాస్ బండ పేలి తాటాకు ఇల్లు దగ్ధమైంది. మైలవరం మండలం వెల్వడం గ్రామం తోలుకోడు రోడ్డులోని చెరువు సమీపంలో కాలువ కట్టపై నివసిస్తున్న సీహెచ్ మధుకు చెందిన తాటాకు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచి గ్యాస్ బండపై పడ్డాయి. గ్యాస్ బండ పేలి ఇల్లు, ఇంట్లోని సామగ్రి ధ్వంసమయ్యాయి. ఇంటి యజమాని మధు విజయవాడలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్య వద్దకు వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న కుమారుడు భయంతో బయటికి పరుగులు తీశాడు. ఇల్లు పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక శాఖాధికారి బాలాజీ పర్యవేక్షణలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.



ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు అవుతున్నా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించలేదని ఆగిరిపల్లి మండల ఫ్యాప్టో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలపై చలో విజయవాడ కార్యక్రమానికి సంఘీభావంగా ఉపాధ్యాయులు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి స్టేట్ బ్యాంక్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఫ్యాప్టో మండల కన్వీనర్లు మక్కే వేణుగోపాలరావు, అజరయ్య మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను కానీ పీఆర్‌సీ కమిటీని నియమించడం కానీ చేయలేదన్నారు. ఫ్యాప్టో నాయకులు తాడి నరసింహారావు, చౌటపల్లి సురేష్ కుమార్, అంకం వెంకటేశ్వరరావు, తాడి ప్రసాద్, జల సూత్రం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

మైలవరం: కీర్తిరాయునిగూడెంలోని రెండు ఆలయాల్లో చోరీ జరిగింది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కీర్తిరాయునిగూడెం చెరువు సమీపంలోని తోటలో సత్తెమ్మ తల్లి ఆలయం ఉంది. ఆలయంలో బంగారు సూత్రాలు, నాగేంద్ర స్వామి ఆలయంలో కిలోన్నర ఉండే శటారు, పళ్లెం చోరీ జరిగింది. సమాచారం అందుకున్న ఎస్ఐ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించారు. సీసీ కెమేరాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

మిట్టగూడెం(విస్సన్నపేట): గొంతెమ్మ పండుగ సందర్భంగా తాతకుంట్ల పంచాయతీ మిట్టగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి సంగీత విభావరి, బీకేఆర్ఎస్ స్వరాభిషేకం పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన

మైలవరం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తగ్గించిన జీఎస్టీతో పన్నులు తగ్గి ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, తద్వారా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో జీఎస్టీపై బీకాం, బీఏ, బీఎస్సీ విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌కే కరీముల్లా, నారాయణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

చాట్రాయి: వన సంరక్షణ నిధులు దుర్వినియోగమయ్యాయని నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని పర్వతాపురం ఫారెస్టులో వన సంరక్షణ సమితి నిధులు రూ.40 లక్షలు దుర్వినియోగం అయినట్లు అంబేడ్కర్ వాది రావణ బ్రహ్మ సోమవారం సబ్ కలెక్టర్ వినూత్నకు ఫిర్యాదు చేశారు.

పిచ్చికుక్క స్వైరవిహారం
పది మందికి గాయాలు

విస్సన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి పది మందిని గాయపరిచింది. చంద్రుపట్లలో ముగ్గురిని, మిట్టగూడెంలో ఒక్కరిని, రాజీవ్ నగర్ కాలనీలో నలుగురు, విస్సన్నపేటలో ఇద్దరిని కుక్క కరిసింది. బాధితులు స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందారు. కుక్కదాడిలో ఇద్దరు చిన్నారులు, మహిళలు సైతం గాయపడ్డారు. వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి



నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు సకాలంలో పరిష్కరించాలని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదేశించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సబ్ కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీలను గడువులోగా పరిష్కరించలేకపోతే దానికి సంబంధించిన సరైన కారణాన్ని అర్జీదారుడికి తెలపాలన్నారు. ప్రజల నుంచి 39 అర్జీలు రాగా వాటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు.

ఈక్రాప్ నమోదు తనిఖీ

తిరువూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులు నమోదు చేయించుకున్న ఈక్రాప్ వివరాలను సోమవారం తిరువూరు తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్ తనిఖీ చేశారు. పాత తిరువూరులో పత్తి పంట నమోదు రికార్డులను పరిశీలించారు. ఈ క్రాప్ ప్రయోజనాలను రైతులకు వివరించారు. ప్రతి రైతు తాము సాగు చేసే పంటల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. నమోదుకు ఈ నెల 25 వరకు అవకాశం ఉన్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకేవైసీ కూడా చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారి పద్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

నూజివీడు: రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల శ్రీకాకుళం జిల్లాలో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని, అలాగే కర్నూలు జిల్లాలో గిట్టుబాటు ధర లేక నష్టపోయిన టమోటా, ఉల్లి రైతులను ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. హరినాథ్ డిమాండ్ చేశారు. రైతాంగాన్ని ఆదుకోవాలంటూ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. నాయకులు, రైతులు పాల్గొన్నారు.

50 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి: మండలంలోని పోతనపల్లిలో సోమవారం ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. హసావతు విజయ నుంచి రెండు లీటర్లు సారా, రెండు కిలోల బెల్లం, 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

దోబీఘాట్ స్థలంపై ఫిర్యాదు

తిరువూరు: తిరువూరు పట్టణ రజకుల అవసరాల నిమిత్తం గతంలో గ్రామ పంచాయతీ కేటాయించిన దోబీఘాట్ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని రజక సంఘం అధ్యక్షుడు ముదిగొండ దుర్గాప్రసాద్ సోమవారం నగర పంచాయతీ కమిషనర్ మనోజకు ఫిర్యాదు చేశారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 2004లో తిరువూరు మేజర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి మల్లమ్మ చెరువు సమీపంలోని వెంకటేశ్వరపురంలో అరున్నర సెంట్ల స్థలాన్ని దోబీఘాట్‌కు కేటాయించారన్నారు. ఈ స్థలంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు దోబీఘాట్ నిర్మాణ పనులను కూడా చేపట్టారని, కొద్దికాలంగా నిరుపయోగంగా ఉన్న దోబీఘాట్ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు నకిలీ దస్తావేజులు సృష్టించి లక్షలాది రూపాయలకు ఇతరులకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. దోబీఘాట్ స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.



వినతిపత్రం సమర్పిస్తున్న రజక సంఘ నాయకులు

రోడ్డుపై గుంతలు.. ఇరుక్కుపోయిన లారీ

రాకపోకలకు ప్రజల ఇబ్బందులు

జి.కొండూరు: జి.కొండూరు పోలీసుస్టేషన్ నుంచి మునగపాడు వరకు ఉన్న బైపాస్ రోడ్డులో సోమవారం మధ్యాహ్నం కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీ చిన్న గుంతలో దిగడంతో ఇరుక్కుపోయింది. గంటల కొద్దీ రోడ్డుపై లారీ ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. పొక్లెయిన్ సాయంతో లారీని బయటకు తీయడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. జి.కొండూరు నుంచి గడ్డమణుగు మీదుగా ఉన్న రహదారి విస్తరణ పనులు నిలిచిపోవడంతో పాటు జి.కొండూరు గెయిల్ ఇండియా కంపెనీ నుంచి గడ్డమణుగు ఎస్‌సీ కాలనీ మీదుగా ఉన్న రహదారి ధ్వంసమవడంతో ప్రస్తుతం ఈ బైపాస్ రహదారి వాహనాల రాకపోకలకు ప్రధాన రహదారిగా మారింది. దీనితో లోయ గ్రామాలైన మునగపాడు, చెర్వుమాధవరం, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని, దుగ్గిరాలపాడు గ్రామాలకు చెందిన ప్రజలు జి.కొండూరు వైపు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. గడ్డమణుగు లోయలో ఉన్న క్వారీలు, క్రషర్ల నుంచి వచ్చే భారీ వాహనాలు కూడా ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగించడం వల్ల రహదారి మొత్తం గుంతలు ఏర్పడుతున్నారు.



మునగపాడు-జి.కొండూరు బైపాస్ రోడ్డు గుంతలో ఇరుక్కుపోయిన టిప్పర్ లారీ

బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక



బాస్కెట్‌బాల్ అండర్-17కు ఎంపికైన బాలుర జట్టు

నూజివీడు: పట్టణంలోని బిస్ స్కూల్‌లో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కృష్ణా జిల్లా బాస్కెట్ బాల్ అండర్-14, అండర్-17 బాలబాలికల జట్ల ఎంపిక నిర్వహించారు. కార్యక్రమాన్ని డీవైఈఓ పీఎస్ సుధాకర్ ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జి. రాంబాబు, స్కూల్ కరస్పాండెంట్ బండి శ్యామ్, పీడీలు వాకా నాగరాజు, ఎస్.లక్ష్మి, వనజ, సతీష్‌కుమార్, సరళ, ఆర్‌వీ బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి చెకుముకి సంబరాలు

తిరువూరు: 8,9,10 తరగతుల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి చెకుముకి సంబరాలు నిర్వహించనున్నామని జేవీవీ తిరువూరు శాఖ అధ్యక్షుడు శీనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 18న పాఠశాల స్థాయిలో, నవంబరు 1న మండల స్థాయిలో, 23న జిల్లా స్థాయిలో, డిసెంబరు 12, 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు సైన్స్‌లో పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని కోరారు.

చాట్రాయి మండలంలో భారీ వర్షం



చాట్రాయి: మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో గంటపాటు వర్షం పడింది. రోడ్లు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

నేడు చండీహోమం

తిరువూరు: తిరువూరు రాజుపేటలోని శ్రీఅష్టలక్ష్మీ ఆలయంలో మంగళవారం విశేష చండీహోమం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త పద్మనాభశాస్త్రి తెలిపారు. ఉదయం 8 గంటలకు చండీ పారాయణ, సామూహిక కుంకుమ పూజ, అనంతరం చండీ హోమం జరుగుతుందన్నారు.